# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆధార్‌తో బ్యాంకు ఖాతాలు అనుసంధానమైన పింఛనుదారులకు వచ్చే నెల 1వ తేదీన నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.**
2. **రాష్ట్రంలో ఆహార భద్రతను పెంచే లక్ష్యంతో ఢిల్లీలోని భారత ఆహార భద్రత, నియంత్రణ శాఖతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.**
3. **ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకూ తెలంగాణలో 104 కోట్ల 18 లక్షల రూపాయల విలువైన నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ కార్యాలయం ప్రకటించింది.**
4. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు తీవ్ర వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది.**
5. **ఈరోజు అంతర్జాతీయ నృత్య దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లో 65 లక్షల 50 వేల మంది పింఛనుదారుల్లో 48 లక్షల 92 వేల మందికి సంబంధించి సుమారు 74 శాతం బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమైనట్టు గుర్తించామని.. వీరందరికీ పింఛను మొత్తాన్ని మే 1వ తేదీన నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వెల్లడించారు. మిగతా 16 లక్షల 58 వేల మందికి ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందిస్తామన్నారు. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారు సైనిక పింఛన్లు తీసుకునే వారితోపాటు బ్యాంకు ఖాతా లేనివారికి ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేస్తామని నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పింఛను పంపిణీ ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పింఛనుదారులు అసౌకర్యానికి గురికాకుండా చూడాలని ఎన్నికల సంఘం సూచించిందని వెల్లడించారు.

-------------------------

రాష్ట్రంలో ఆహార భద్రతను పెంచే లక్ష్యంతో ఢిల్లీలోని భారత ఆహార భద్రత, నియంత్రణ శాఖ ఎఫ్ఎస్ఎస్ఏఐతో అవగాహనా ఒప్పందాన్నిఇప్పటికే కుదుర్చుకున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ నిన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం వలన 80 కోట్ల రూపాయల నిధులు సమకూరాయని, వీటిని ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ల్యాబ్‌లు, మొబైల్ ఫుడ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు, ఆహార భద్రత పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి ఉపయోగిస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా

వంటనూనె పునర్వినయోగంపై  300లకు పైగా కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి వైజాగ్, గుంటూరు, తిరుపతిలలో మూడు ఫుడ్ ల్యాబ్‌ల కార్యకలాపాలు మొదలవుతాయని కమీషనర్ పేర్కొన్నారు.

-----------------------------

ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకూ తెలంగాణ పోలీసుశాఖ 104 కోట్ల 18 లక్షల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ కార్యాలయం నిన్న ఓ ప్రకటన విడుదల చేసింది. మార్చి 16వ తేదీ నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ జరిపిన తనిఖీల్లో ఈ నగదు మొత్తం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించేందుకు 477 ఫ్లయింగ్ స్క్వాడ్లు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 89 చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 464 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఆ ప్రకటనలో డీజీపీ కార్యాలయం పేర్కొంది.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో తెలంగాణకు నిధులు, పరిశ్రమలు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. విభజన హామీల అమలు, రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్, వనస్థలిపురంలో నిన్నముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహించి ప్రసంగించారు. హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరిస్తామని... వరద ముంపు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

-----------------------------

చైనాలోని షాంఘైలో జరుగుతున్న విలువిద్య ప్రపంచ కప్ స్టేజ్-1లో వ్యక్తిగత, మిక్స్‌డ్, బృంద విభాగాల్లో 3 స్వర్ణ పతకాలు సాధించిన జ్యోతి సురేఖ వెన్నంను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అభినందించారు. జ్యోతి సురేఖ అసాధారణ ప్రతిభకు దేశం గర్విస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

-----------------------------

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరం సీట్ల భర్తీకి నిన్న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 87.79 శాతం విద్యార్థులు హాజరైనట్లు టీజీఆర్‌డీసీ సెట్ కన్వీనర్ సైదులు తెలిపారు. 64 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 18 వేల 989 మంది దరఖాస్తు చేయగా, 16 వేల 564 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతి బాపులే బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్ల భర్తీకి 208 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన రాత పరీక్షకు 88.02శాతం హాజరు నమోదైందని చెప్పారు.

-----------------------------

ఈరోజు అంతర్జాతీయ నృత్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. నృత్య కళ గురించి ప్రజలలో అవగాహన పెంపొందించడం, నృత్య విద్యను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. అంతర్జాతీయ నృత్య సంఘం పిలుపుమేరకు 1982 నుండి ప్రతి  ఏటా ఏప్రిల్ 29న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రముఖ ఫ్రెంచ్ నృత్య కళాకారుడు, బ్యాలెట్ మాస్టర్ జోన్ జార్జెస్ నోవెర్రే 1727 ఏప్రిల్ 29న జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకుని... ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం జరుగుతోంది.

నృత్యం మనలో దాగి వున్న ఒక అద్భుత కళను వెలుగులోకి తీసుకురావడమే కాక.. శారీరక ఆరోగ్యం కోసం కూడా ప్రతి ఒక్కరూ నృత్యాన్ని అభ్యసించడం అలవాటు చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదు సంవత్సరాల కాలంలో మ్యానిఫెస్టోను 99 శాతం అమలుచేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. నిన్న ఆయన అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా వెంకటగిరి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. తన 58 నెలల పాలనను చూసి ప్రజలే ఓట్లు వేయాలని ఆయన అభ్యర్థించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఐదేళ్ల కాలంలో 133 సార్లు బటన్ నొక్కి.. 2 లక్షల 70 వేల కోట్ల రూపాయల నగదును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామని వెల్లడించారు. విద్యార్థుల కోసం పాఠశాలల్లోనే మంచి ఆహారం అందిస్తున్నామని... దుస్తుల నుంచి పుస్తకాలు, డిజిటల్ బోర్డులు, ట్యాబులు అందించి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చామని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించాలని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. నిన్న ఆయన కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభల్లో ప్రసంగించారు. 200 రూపాయల పింఛన్‌ను 2 వేల రూపాయలకు పెంచిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే పింఛన్‌ను 4 వేల రూపాయలకు పెంచుతామని.. పెంచిన మొత్తాన్ని ఈ ఏప్రిల్ నెల నుంచి అమలు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

---------------------------

ఎన్డీయే కూటమి మేనిఫెస్టోను రేపు ప్రకటిస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజవర్గం పరిధిలోని ఏలేశ్వరంలో నిన్న నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రసంగించారు. పంతాడ మైనింగ్‌ను క్రమబద్ధీకరిస్తామని ఆయన తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎయిడెడ్ విద్యాసంస్థలను పునరుద్ధరిస్తామని, భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్నా... ఉద్యోగ అవకాశాలు రావాలన్నా ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ప్రజలను కోరారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరంలో నిన్న ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ గోదావరి నది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేయలేదని విమర్శించారు.

---------------------------

జనసేన పార్టీకి కామన్ సింబల్ 'గ్లాసు' గుర్తు కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అన్ని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ

చేశారు. గతంలో గ్లాసు గుర్తును ఎన్నికల సంఘం ఫ్రీ సింబల్స్ జాబితాలో పేర్కొంది.

ఇలా ఉండగా.. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీకి అన్ని నియోజకవర్గాల్లో 'టార్చ్‌లైట్' గుర్తును కేటాయిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

---------------------------

దక్షిణ, నైరుతి దిశ నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో గరిష్ఠంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటుతున్నాయి. రానున్న నాలుగు రోజుల్లో వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మే 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈరోజు, రేపు ఉత్తర కోస్తాలో పిడుగులు పడే అవకాశముందని తెలిపింది. ఈరోజు 47 మండలాల్లో తీవ్ర వడగాలులు, 151 మండలాల్లో వడగాలులు వీయవచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సాధారణం కన్నా దాదాపు ఐదు డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్ది రోజులుగా ప్రమాద హెచ్చరిక స్థాయి 45 డిగ్రీలను దాటి ఎండలు కాస్తున్నాయి. ఖమ్మం, ములుగు జిల్లాల్లో నిన్న వడగాలులు వీచినట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈరోజు, రేపు ఉష్ణోగ్రతల తీవ్రత కొనసాగుతుందని, కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ ఐఎండీ పేర్కొంది.

=====================